క్లుప్తంగా

పరిశుభ్రతపై ఎన్‌సీసీ క్యాడెట్ల సైకిల్ ర్యాలీ



కొమరోలులో సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్‌సీసీ క్యాడెట్లు

కొమరోలు: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎన్‌సీసీ క్యాడెట్లు శుక్రవారం ఎన్‌సీసీ అధికారి కదిరిపోగు విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఆర్టీసీ బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించి ప్రజలకు పరిశుభ్రత, ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పించారు. అనంతరం పాఠశాల మైదానాన్ని శుభ్రం చేశారు. కార్యక్రమంలో హైస్కూల్ హెచ్ఎం అశ్వనీకుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అవకాశాలు అందిపుచ్చుకుని చదువులో రాణించాలి



పాఠశాల పీఈటీని అభినందిస్తున్న డీవైఈఓ

కొనకనమిట్ల: అవకాశాలు అందిపుచ్చుకుని విద్యార్థులు చదువులో రాణించాలని డీవైఈఓ చంద్రమౌళీశ్వర్ సూచించారు. శుక్రవారం మర్రిపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలను ఆయన పరిశీలించారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరీక్షించారు. విద్యార్థులు ట్యాబ్‌లు సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం హెచ్ఎం, ఉపాధ్యాయులతో బోధన అంశాలపై సమీక్షించారు. స్కూల్ గేమ్స్‌లో ప్రతిభ చాటిన విద్యార్థులను, హెచ్ఎం నాగేశ్వరరావు, పీఈటీ కోటేశ్వరిని అభినందించారు. పీఈటీని ఘనంగా సన్మానించారు.

పాపినేనిపల్లె సర్పంచ్‌గా నాగమల్లేశ్వరి



సర్పంచ్ సీటులో నాగమల్లీశ్వరి

బేస్తవారిపేట: అర్ధవీడు మండలంలోని పాపినేనిపల్లె సర్పంచ్‌గా వైఎస్సార్‌సీపీ సానుభూతిపరురాలైన నల్లబోతుల నాగమల్లీశ్వరి తిరిగి బాధ్యతలు స్వీకరించారు. అనారోగ్యం కారణంగా కొంతకాలంగా సర్పంచ్ బాధ్యతలకు ఆమె దూరంగా ఉన్నారు. ఆమె స్థానంలో టీడీపీ సానుభూతిపరురాలు కొమెరె అచ్చమ్మ ఇన్‌చార్జిగా వ్యవహరించారు. డీపీఓ అచ్చమ్మను తొలగిస్తూ ఆదేశాలు జారీ చేయడంతో శుక్రవారం నాగమల్లేశ్వరి బాధ్యతలు చేపట్టారు.

ఓబన్న జయంతిని విజయవంతం చేయండి


గిద్దలూరు రూరల్: స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డెర ఓబన్న జయంతిని విజయవంతం చేయాలని నగర పంచాయతీ చైర్మన్ పాముల వెంకటసుబ్బయ్యయాదవ్ పేర్కొన్నారు. స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం వడ్డెర ఓబన్న జయంతి పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ డి.వెంకటదాసు మాట్లాడుతూ.. జనవరి 11వ తేదీన విజయవాడలో నిర్వహించనున్న వడ్డెర ఓబన్న 227 జయంతి కార్యక్రమానికి బీసీలు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సంఘ నాయకులు బత్తుల సంజీవరాయుడు, నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సైన్స్ ల్యాబ్ రికార్డులు పంపిణీ



గిద్దలూరు రూరల్: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల విద్యార్థులకు యశ్వంత్ ఎడ్యుకేషన్ సొసైటీ గౌరవాధ్యక్షుడు, హిందీ ఉపాధ్యాయుడు మొర్రి పిచ్చయ్యయాదవ్ శుక్రవారం సైన్స్ ల్యాబ్ రికార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాదలకుంటపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హిందీ ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ తన వేతనంలో 20 శాతం విద్యార్థుల చదువు కోసం ఖర్చు చేస్తున్నానని వివరించారు. దాతల సహాయాన్ని సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కంచి విద్యాలయానికి పుస్తకాల బహూకరణ



పొదిలి రూరల్: మండలంలోని ఓబులక్కపల్లి వద్ద ప్రఖ్యాత విద్యా సంస్థ కంచి కామకోటి శంకర విద్యాలయానికి ఎంఈఓ ఎం.శ్రీనివాసులురెడ్డి ఆధ్యాత్మిక గ్రంథాలను శుక్రవారం బహూకరించారు. ఆంధ్ర మహాభారతం, రామాయణం, భగవద్గీత, గురుగీత, పిల్లలకు ఉపకరించే పంచతంత్ర, ఈసోప్ కథలు, సైన్స్‌కు సంబంధించిన 200 పుస్తకాలు అందజేశారు. దాతలను పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ గాలి మాధవి అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు భాస్కర్, నాగలక్ష్మి, రవికాంత్, సాయినిఖిల్, సీఆర్పీ గాదె సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

కొత్త పింఛన్లు లేనట్టే!

- అక్టోబర్ 1 నుంచి కొత్త పింఛన్లు ఇస్తామన్న కూటమి ప్రభుత్వం
- నేటికీ తెరుచుకోని పింఛన్ల వెబ్‌సైట్
- అధికారులు, కూటమి నాయకుల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్న అర్హులు
- మరో వైపు పింఛన్లు తొలగించేందుకు రంగం సిద్ధం



బేస్తవారిపేటలోని గ్రామ సచివాలయం

బేస్తవారిపేట:

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరి నాలుగు నెలలవుతోంది. ఇంత వరకు కొత్త పింఛన్ల పంపిణీపై కార్యాచరణ రూపొందించలేదు. కానీ అక్టోబర్ ఒకటో తేదీ నుంచి కొత్త పింఛన్లు మంజూరు చేస్తామని ప్రభుత్వ పెద్దలు ఆర్భాటంగా ప్రకటించారు. ఈ నేపథ్యంలో అర్హులైన లబ్ధిదారులు పింఛన్ల కోసం ఆశగా ఎదురు చూస్తున్నారు. గత ప్రభుత్వంలో రాజకీయాలు, పార్టీలకు సంబంధం లేకుండా సచివాలయంలో దరఖాస్తు చేసుకుంటే పింఛన్లు మంజూరయ్యేవి. కూటమి ప్రభుత్వం పింఛన్ల మంజూరుపై ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో గత ప్రభుత్వంలో పింఛను కోసం దరఖాస్తు చేసుకున్న వారికి కూడా ఎదురుచూపులు తప్పడం లేదు. కొత్తగా ఒక్కరికి కూడా పింఛను ఇవ్వలేదు కానీ ఇది మంచి ప్రభుత్వం అంటూ ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేస్తుండటంతో ఇదెక్కడి విడ్డూరం అంటూ ప్రజలు పెదవి విరుస్తున్నారు.

అర్హత ఉన్నా ఎదురుచూపులే..

అర్హులైన వితంతువులు, దివ్యాంగులు, వృద్ధులు కొత్త పింఛన్ల కోసం ఎదురుచూపులు చూస్తున్నారు. పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకునేందుకు నియోజకవర్గంలోని 78 సచివాలయాలకు రోజూ పదుల సంఖ్యలో లబ్ధిదారులు వెళ్తున్నారు. ప్రభుత్వం నూతన పింఛన్ల కోసం ఎలాంటి వెబ్‌సైట్ తెరవకపోవడంతో అర్హులు నిరాశతో వెనుదిరగాల్సి వస్తోంది. కొత్త పింఛన్లు ఎప్పుడు ఇస్తారో ఇంకా ప్రభుత్వం నుంచి సమాచారం లేదని సచివాలయ సిబ్బంది చెబుతున్నారని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే కొత్తగా వివాహాలైన వారు రేషన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకుందామని సచివాలయాలకు వెళ్లినా «తెలియదు» అనే సమాధానమే వస్తోంది.

గత ప్రభుత్వంలో పక్కాగా..

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పింఛను, కొత్త రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న వెంటనే అందించేవారు. ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగింది. కానీ నేడు ఆ పరిస్థితి లేకుండా పోయింది. కూటమి ప్రభుత్వం పింఛన్లు, రేషన్ కార్డుల వెబ్‌సైట్‌ను పూర్తిగా నిలిపివేసింది. దీంతో కొత్తగా పింఛన్, రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని భావించినవారు సచివాలయాల చుట్టూ తిరగలేక ఇబ్బందులు పడుతున్నారు.

> **వంద రోజులైనా తెరుచుకోని సైట్..**
> సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన తర్వాత ఆగిన వెబ్‌సైట్, కూటమి ప్రభుత్వం వచ్చి 100 రోజులు దాటినా ఎందుకు తెరుచుకోలేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. లబ్ధిదారులకు సచివాలయ సిబ్బంది సమాధానం చెప్పలేక ముఖం చాటేస్తున్నారు.

పింఛన్లు తొలగించే కుట్ర

కొత్త పింఛన్ల మాట దేవుడెరుగు. ప్రస్తుతం వస్తున్న పింఛన్లను ఎలాగైనా తొలగించాలని అధికార పార్టీ నాయకులు కుయుక్తులు పన్నుతున్నారు. అక్టోబర్ నెలలో గ్రామసభలు పెట్టి అనర్హత పేరుతో పింఛన్లను తొలగించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. కొత్త పింఛన్ల కోసం ప్రజలు ఎదురుచూస్తుంటే, ఉన్న పింఛన్లు తొలగించడానికి అధికార పార్టీ నాయకులు కుట్రలు చేయడంపై తీవ్ర స్థాయిలో విమర్శలొస్తున్నాయి.

రాజకీయ దుర్బుద్ధితోనే తిరుమల లడ్డూపై ఆరోపణలు

- తిరుమల పవిత్రతకే చంద్రబాబు కళంకం తెచ్చారు
- బాబు చేసిన పాప ప్రక్షాళనకు నేడు ఆలయాల్లో పూజలు నిర్వహించాలి
- వైఎస్సార్ సీపీ శ్రేణులకు మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు, కేపీ నాగార్జునరెడ్డి పిలుపు



కేపీ నాగార్జునరెడ్డి



అన్నా రాంబాబు

బేస్తవారిపేట: తిరుమల లడ్డూ ప్రసాదంపై రాజకీయ దుర్బుద్ధితో ఆరోపణలు చేసి ఆలయ పవిత్రతకు కళంకం తెచ్చిన చంద్రబాబు పాపాన్ని ప్రక్షాళన చేయాలని కోరుతూ శనివారం ఆలయాల్లో వైఎస్సార్ సీపీ శ్రేణులు పూజలు నిర్వహించాలని మాజీ ఎమ్మెల్యే, ఆ పార్టీ గిద్దలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి కేపీ నాగార్జునరెడ్డి పిలుపునిచ్చారు. తిరుమల లడ్డూలో వినియోగించే నెయ్యిలో జంతువుల కొవ్వు కలిసిందని అసంబద్ధమైన ఆరోపణలను, దుష్ప్రచారాన్ని ప్రతి ఒక్కరూ ఖండించాలని కోరారు. నియోజకవర్గంలోని ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ హోదాల్లో ఉన్న పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పూజల్లో పాల్గొనాలని సూచించారు.

మార్కాపురంలో అన్నా..

మార్కాపురం: తిరుమల లడ్డూ ప్రసాదంపై, పుణ్యక్షేత్రం పవిత్రతపై రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబునాయుడు చేస్తున్న దుష్ప్రచారాన్ని ఖండిస్తూ పాప ప్రక్షాళన కావాలని కోరుతూ వైఎస్సార్ సీపీ మాజీ ఎమ్మెల్యే, మార్కాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి అన్నా రాంబాబు ఆధ్వర్యంలో శనివారం ఉదయం 9 గంటలకు స్థానిక లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆయన కార్యాలయ ప్రతినిధి తెలిపారు. నియోజకవర్గంలోని తర్లుపాడు, కొనకనమిట్ల, పొదిలి మండలాల్లో కూడా పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక పూజలు చేయాలని సూచించారు.

నేడు వెలుగొండస్వామి ఆలయంలో..

కొనకనమిట్ల: తిరుమల లడ్డూ ప్రసాదంపై, తిరుమల పవిత్రతపై రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న దుష్ప్రచారాన్ని ఖండిస్తూ, సీఎం హోదాలో చంద్రబాబునాయుడు చేసిన పాపం ప్రక్షాలన కావాలని కోరుతూ శనివారం ప్రసిద్ధ పుణ్యక్షేత్రం వెలుగొండ వెంకటేశ్వరస్వామి ఆలయంలో పార్టీ నేతలు ప్రత్యేక పూజలు చేయనున్నట్లు మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ మోరా శంకర్‌రెడ్డి తెలిపారు. పూజా కార్యక్రమంలో మార్కాపురం నియోజకవర్గం పార్టీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులరెడ్డి, మండల ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణయాదవ్, జెడ్పీటీసీ అక్కిదాసరి ఏడుకొండలు పాల్గొంటున్నట్లు తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలని శంకర్‌రెడ్డి కోరారు.

బాధ్యతలు స్వీకరించిన అధికారులు



ఏపీఎం సుధాకరరావు



వీరభద్రాచారి



శ్రీనివాసులు



బాలయ్య

మార్కాపురం: మార్కాపురం డివిజన్ అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా డి.బాలయ్య శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఎన్‌టీఆర్ కృష్ణా జిల్లా మైలవరం డీటీఎఫ్ సీఐగా పనిచేస్తూ పదోన్నతిపై ఏఈఎస్‌గా మార్కాపురానికి బదిలీ అయ్యారు. ఎస్సై గోపాలకృష్ణ, సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

పీఆర్ ఈఈగా శ్రీనివాసులు

మార్కాపురం డివిజన్ పంచాయతీరాజ్ ఈఈగా జి.శ్రీనివాసులు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన విజయనగరం జిల్లా బొబ్బిలి నుంచి బదిలీపై మార్కాపురం వచ్చారు. ఈయన 2017 నుంచి 2021 వరకు మార్కాపురం డీఈగా విధులు నిర్వర్తించారు.

కంభం ఎంపీడీఓగా వీరభద్రాచారి

కంభం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ వీరభద్రాచారి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఎంపీడీఓగా పనిచేస్తున్న సయ్యద్ మస్తాన్ వలి కొమరోలుకు బదిలీ కాగా, పల్నాడు జిల్లాలో విధులు నిర్వర్తిస్తున్న వీరభద్రాచారి కంభంలో నియమితులయ్యారు.

బాధ్యతలు చేపట్టిన ఎంపీడీఓ

బేస్తవారిపేట: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నూతన ఎంపీడీఓ ఆకుల రంగనాయకులు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. పల్నాడు జిల్లా ఈపూరు మండల ఎంపీడీఓగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఆయన బదిలీపై బేస్తవారిపేట మండలంలో నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయనను పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు.



బేస్తవారిపేట ఎంపీడీఓను సన్మానిస్తున్న కార్యదర్శులు

సబ్‌రిజిస్ట్రార్లుగా గిరిజ, విజయలక్ష్మి

మార్కాపురం టౌన్: మార్కాపురం జాయింట్ సబ్ రిజిస్ట్రార్-1గా పి.గిరిజ, జాయింట్ సబ్ రిజిస్ట్రార్-2గా విజయలక్ష్మి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గిరిజ కనిగిరి నుంచి, విజయలక్ష్మి ఒంగోలు ఆడిట్ ఆఫీసు నుంచి మార్కాపురంలో బదిలీపై నియమితులయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న జాయింట్-1 సబ్ రిజిస్ట్రార్ ఎస్‌కే నజ్మల్ హుస్సేన్ గుంటూరు జిల్లా కొల్లిపరకు బదిలీపై వెళ్లారు.

కొనకనమిట్ల ఏపీఎంగా సుధాకరరావు

కొనకనమిట్ల: మండల డీఆర్‌డీఏ ఏనపీఎంగా బి.సుధాకరరావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. సంతనూతలపాడులో విధులు నిర్వర్తిస్తున్న ఆయన బదిలీపై కొనకనమిట్లలో నియమితులవగా, ఇప్పటి వరకు పనిచేసిన కర్నాటి గోపాలకృష్ణారెడ్డి పొదిలి ఏపీఎంగా బదిలీపై వెళ్లారు. నూతన ఏపీఎంను కార్యాలయ ఉద్యోగులు అభినందించారు.

వరద బాధితులకు రూ.65 వేల విరాళం



విరాళాన్ని అందిస్తున్న మెడికల్ అసోసియేషన్ ప్రతినిధులు

మార్కాపురం: విజయవాడ వరద బాధితులకు మార్కాపురం మెడికల్ అసోషియేషన్ తరుపున 65 వేల రూపాయల విరాళాన్ని అసోసియేషన్ కార్యదర్శి వేమూరి సుబ్బారావు, ట్రెజరర్ సతీష్‌కు అందించినట్లు అధ్యక్షుడు శ్రీనివాసరావు, కోశాధికారి ప్రసాద్ తెలిపారు. వరదల్లో నష్టపోయిన వారికి తమవంతు సాయంగా ఈ విరాళాన్ని అందించినట్లు పేర్కొన్నారు.

దివ్యాంగులకు సౌకర్యాలు కల్పించండి



దివ్యాంగ విద్యార్థులతో సబ్ కలెక్టర్ త్రివినాగ్, ఏడీ అర్చన

- సబ్ కలెక్టర్ త్రివినాగ్

మార్కాపురం: దివ్యాంగులకు మంచి సౌకర్యాలు అందించాలని సబ్ కలెక్టర్ సహదిత్ వెంకట త్రివినాగ్ ఆదేశించారు. శుక్రవారం ఆయన జిల్లా దివ్యాంగుల సంక్షేమ శాఖ శాఖ ఏడీ అర్చనతో కలిసి స్థానిక స్ఫూర్తి మానసిక దివ్యాంగుల పాఠశాలను సందర్శించారు. రికార్డులు పరిశీలించినఅనంతరం కరస్పాండెంట్ కాశిరెడ్డితో మౌలిక వసతులపై మాట్లాడారు. దివ్యాంగుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

గౌడ్‌లకు ఒక్క మద్యం దుకాణమైనా కేటాయించాలి



సమావేశంలో పాల్గొన్న గౌడ సంఘం నాయకులు

మార్కాపురం టౌన్: నూతన మద్యం పాలసీలో గౌడ కులస్తులకు 10 శాతం రిజర్వేషన్ కేటాయించినప్పటికీ మార్కాపురం నియోజకవర్గంలో ఒక్క షాపు కూడా రాలేదని నియోజకవర్గ గౌడ సంఘం గౌరవ అధ్యక్షుడు జాతీయ బీసీ సంఘ కార్యవర్గ సభ్యులు ఇల్లూరి రంగస్వామి గౌడ్ పేర్కొన్నారు. శుక్రవారం మార్కాపురంలోని ఓ నేత్ర వైద్యశాలలో గౌడ సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మార్కాపురంలో కల్లుగీత కార్మికులకు సొసైటీ లేకపోవడం వల్ల ఇతర వ్యాపారాలు చేసుకుంటున్నారన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా గౌడ్‌లకు ఒక్క మద్యం షాపు అయినా కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో సంఘ అధ్యక్షుడు జి.రమణగౌడ్, నాయకులు బత్తిన శ్రీనివాసరావు, కంచర్ల నాగభూషణం, ఇల్లూరి మల్లికార్జున, శ్రీరంగం, జూపల్లి అల్లూరయ్య, వి.శ్రీనివాసులు, జి.వెంకటేశ్వర్లు, వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ గేమ్స్‌లో సత్తా చాటిన విద్యార్థులు



జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన మార్కాపురం జెడ్పీ బాలుర హైస్కూల్ విద్యార్థులు



మార్కాపురం సాయిబాలాజీ స్కూల్ విద్యార్థులు

మార్కాపురం టౌన్: స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు 20 మంది స్కూల్ గేమ్స్ నియోజకవర్గ స్థాయిలో విజయం సాధించి జిల్లా స్థాయికి ఎంపికైనట్లు ఇన్‌చార్జి హెచ్ఎం శ్యామ్ సుభకర్ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల పీడీ జాహ్నవి ప్రియ, పీఈటీ చెన్నకృష్ణ, ఉపాధ్యాయులు అభినందించారు.

- సాయిబాలాజీ స్కూల్ విద్యార్థులు స్కూల్ విద్యార్థులు 17 మంది స్కూల్ గేమ్స్ జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు డైరెక్టర్ పి.ప్రకాష్‌రావు తెలిపారు. ప్రతిభ చాటిన విద్యార్థులను పాఠశాల పీడీ వలి, పీఈటీ వెంకటేశ్వర్లు, క్రీడాకారులను యాజమాన్యంతోపాటు ప్రిన్సిపాల్ మస్తాన్‌వలి, ఉపాధ్యాయులు అభినందించారు.

మార్కాపురం రూరల్: నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్‌లో దరిమడుగు హైస్కూల్ విద్యార్థులు 14 మంది అండర్-14, 17 విభాగాల్లో విశేష ప్రతిభ కనబరిచారు. వారిని హెచ్ఎంతోపాటు పీఈటీ బాబూరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

తర్లుపాడు: స్కూల్ గేమ్స్‌లో మీర్జపేట జెడ్పీ పాఠశాల విద్యార్థులు 12 మంది సత్తా చాటారని హెచ్ఎం కె.ప్రవీణ్ కుమార్ తెలిపారు. కోచ్ స్వామి కుమార్, సంజీవ కుమార్‌ను హెచ్ఎం అభినందించారు. విద్యార్థులను ఉపాధ్యాయులు, గ్రామస్తులు సన్మానించారు.

రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు వెలుగొండ విద్యార్థులు

కొనకనమిట్ల: రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు వెలుగొండలోని అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ ఎస్.వెంకటేశ్వరరావు తెలిపారు. ఇటీవల మైనంపాడులో నిర్వహించిన జిల్లా స్థాయి హాకీ అండర్-14, 17 పోటీల్లో ఆదిత్య, సుశాంత్, శివచైతన్య, రంగ శివ ప్రతిభ కనబరిచారని వివరించారు. విద్యార్థులతోనపాటు పీఈటీలు చంద్రశేఖర్, ఖాదర్‌బాషాను ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు.



హాకీ పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్



దరిమడుగు హైస్కూల్ విద్యార్థులతో ఉపాధ్యాయులు



మీర్జపేట జెడ్పీ విద్యార్థులతో ఉపాధ్యాయులు